క్లుప్తంగా

కాంగ్రెస్ లీగల్ సెల్ వైస్ చైర్మన్‌గా రవీందర్



టేకుమట్ల: హనుమకొండ కాంగ్రెస్ లీగల్ సెల్ వైస్ చైర్మన్‌గా మండలంలోని బోయినిపల్లికి చెందిన సీనియర్ న్యాయవాది పోషిని రవీందర్ శుక్రవారం నియమితులయ్యారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ.. 15 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో కీలకంగా పని చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేసినట్లు తెలిపారు. తనకు బాధ్యతలు అప్పగించిన టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సమ్మె నోటీస్ అందజేత



కాటారం: ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న కాంట్రాక్టు ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కాటారం మండలం మేడిపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, మహాముత్తారం మండలం పెగడపల్లి ఆశ్రమ పాఠశాల కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు సమ్మెకు సిద్ధమయ్యారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్స్‌కు శుక్రవారం ఉపాధ్యాయులు సమ్మె నోటీసులు అందజేశారు. ఈ నెల 23 నుంచి 27 వరకు నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు వారు పేర్కొన్నారు. ప్రభుత్వం 48 గంటల్లో సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె కొనసాగిస్తామని హెచ్చరించారు. కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు మహేశ్, రాజ్‌కుమార్, రమ, రజిత, వీరన్న, రవీందర్, పుష్పలత, తదితరులు పాల్గొన్నారు.

బ్యూటీషియన్ కోర్సుతో ఉపాధి

ఏటూరునాగారం: బ్యూటీషియన్ కోర్సుతో ఉపాధి లభిస్తోందని ఎస్‌బీఐ ఆర్‌ఎస్‌ఈటీఐ ఉచిత శిక్షకురాలు శివ సరిత అన్నారు. మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో ఎస్‌బీఐ రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇనిస్ట్యూట్ ద్వారా 35 మంది మహిళలకు బ్యూటిషన్ కోర్సులో నెల రోజులపాటు ఉచిత శిక్షణ ఇస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె శుక్రవారం మాట్లాడుతూ.. ఈ కోర్సు పూర్తి చేసుకున్న తర్వాత సర్టిఫికెట్స్ అందజేయడంతోపాటు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉపాధి కల్పిస్తామన్నారు.

పారదర్శకత పాటించాలి

ములుగు: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించేలా చూడాలని బీఆర్‌ఎస్ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కోకిల మహేష్ కోరారు. ఈ మేరకు శుక్రవారం అడిషనల్ కలెక్టర్ సీహెచ్ మహేందర్‌జీకి వినతిపత్రం అందించారు. ఎంపిక చేసే క్రమంలో నిబంధనలు పాటించేవిధంగా అధికారులకు సూచనలు చేయాలని అన్నారు.

బ్యాగుల పంపిణీ

గోవిందరావుపేట: మండల కేంద్రంలోని బాలికల జిల్లా ప్రజా పరిషత్ పాఠశాల విద్యార్థునులకు బిర్లా శక్తి సిమెంట్ వారు స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. రూ.60 వేల విలువ చేసే స్కూల్ బ్యాగులు బిర్లా శక్తి సిమెంట్ డిస్ట్రిబ్యూటర్ నిరంజన్ రావు ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా వారికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గొంది దివాకర్ కృతజ్ఞతలు తెలిపారు.అన్నమేరి, రేణుక, సుగుణాదేవి, వనజ, అంజలి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

గంజాయి తీసుకెళ్తున్న వ్యక్తి అరెస్ట్

పాల్వంచ: స్కూటీపై గంజాయి తరలిస్తున్న వ్యక్తిని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. పాల్వంచ పట్టణ పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టగా భద్రాచలం వైపు నుంచి పాల్వంచ వైపు స్కూటీపై వస్తున్న వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడు. దీంతో ఆయనను అదుపులోకి తీసుకుని పరిశీలించగా బ్యాగ్‌లో 6.7కేజీల గంజాయి లభించింది. ఆయనను జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం కొడవటంచకు చెందిన ముద్దమల్ల శేషుగా గుర్తించగా ఒడిశాలోని కలిమెల నుంచి హైదరాబాద్‌కు గంజాయి తీసుకెళ్తున్నట్లు అంగీకరించాడని ఎస్సై సుమన్ తెలిపారు. దీంతో శేషుతో పాటు అమ్మిన వ్యక్తి, హైదరాబాద్‌లో ఉండే మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

గృహిణి ఆత్మహత్య

మొగుళ్లపల్లి: అనారోగ్య సమస్యలతో గృహిణి ఆత్మహత్య చేసుకున్న ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం గుండ్లకర్తిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని గుండ్లకర్తి గ్రామానికి చెందిన లింగబత్తుల కమల(45) అనే మహిళ కొంత కాలంగా కేన్సర్‌తో హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంది. అయినప్పటికీ వ్యాధి నయం కాకపోగా, కుటుంబ ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని గురువారం రాత్రి ఇంటి వద్ద చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. శుక్రవారం భర్త సదానందం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

కుట్టుమిషన్ల పంపిణీ ఎప్పుడో..?



టేకుమట్ల మహిళా సంఘం భవనంలో నిల్వ చేసిన కుట్టు మిషన్లు



వెలిశాల ఉన్నత పాఠశాలలో నిల్వ చేసిన కుట్టు మిషన్లు

సంవత్సరమైనా పంపిణీ చేయని అధికారులు

- ఎదురు చూస్తున్న మహిళలు

టేకుమట్ల: మహిళా సాధికారతే లక్ష్యంగా గత సంవత్సరం అప్పటి కలెక్టర్ భవేష్‌మిశ్రా మండలంలోని 24 గ్రామాలలోని మహిళా సంఘ సభ్యుల కోసం రూ.20లక్షల నిధులను కేటాయించి కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఒక్కో గ్రామంలోని మహిళా సంఘ సభ్యుల్లో ఆసక్తి గల 10 మంది మహిళలకు శిక్షణనందించి కుట్టు మిషన్లను అందించాలనేది కలెక్టర్ లక్ష్యం. దాని వల్ల మహిళలు ఆర్థికంగా ఎదగడంతో పాటు, కుటుంబానికి ఆసరాగా ఉంటారు. కావున అందుకు అనుగూనంగా మండల సమాఖ్య ఆధ్వర్యంలో ప్రతీ గ్రామం సీఏల ఆధ్వర్యంలో 10 మంది ఆసక్తి గల మహిళా సంఘ సభ్యులను ఎంపిక చేశారు. దాంతో అప్పటి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి టేకుమట్ల, వెలిశాలలో ఒకరిద్దరికి పంపిణీ చేసి మళ్లీ తిరిగి తీసుకుని కుట్టు మిషన్‌లను నిల్వచేశారు. మండల సమాఖ్య ఆధ్వర్యంలో కుట్టు మిషన్‌ల పంపిణీ లబ్ధిదారుల జాబితాను మార్చాలని అప్పటి బీఆర్‌ఎస్ ప్రజా ప్రతినిధులు పట్టుబట్టడంతో పంపిణీ పూర్తిగా నిలిపివేశారు. అంతలోనే ఎన్నికలు, అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కుట్టు మిషన్‌ల పంపిణీని కాంగ్రెస్ నాయకులు తెరపైకి తీసుకువచ్చారు. దాంతో మొదటి రెండు జాబితాల్లో రూపొందించిన లబ్ధిదారుల ఎంపిక మరోసారి మారనుందని మహిళా సంఘ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కలెక్టర్ నిధులపై ప్రజాప్రతినిధుల పెత్తనం..

మహిళా ఆర్థిక సుస్థిరత కోసం కలెక్టర్ ప్రత్యేక చొరవతో మహిళా సంఘ సభ్యులకు కేటాయించిన కుట్టు మిషన్ల పంపిణీపై ప్రజాప్రతినిధుల పెత్తనంపై మహిళా సంఘ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ మహిళలకు కుట్టు మిషన్‌లను నిల్వ చేసి సంవత్సర కాలం గడిచినా ఇప్పటి వరకు మహిళల కోసం అందించిన కుట్టు మిషన్లపై రాజకీయ రంగును పులమడం సరైంది కాదంటున్నారు. మండల సమాఖ్య ఆధ్వర్యంలో రూపొందించిన జబితానే సరైందని మొదటి జాబితా ప్రకారమే కుట్టు మిషన్లను అందించాలని, కాదని అధికార పార్టీ నాయకులకు చెందిన వారికి కేటాయిస్తే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని మండలంలోని పలువురు మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పార్టీలకతీతంగా మహిళా సంఘాల సభ్యులకు కలెక్టర్ పంపిణీ చేసిన కుట్టు మిషన్లను వెంటనే పంపిణీ చేయాలని మహిళా సంఘ సభ్యులు కోరుతున్నారు.

మొదటి జాబితాలో నా పేరుంది..



మహిళా సంఘాల సభ్యులకు కుట్టు మిషన్లను అందించేందుకు మండల సమాఖ్య ఆధ్వర్యంలో కుట్టు మిషన్ల పంపిణీ కోసం రూపొందించిన జాబితాలో నా పేరుంది. సంవత్సరం క్రితం కలెక్టర్ పంపిణీ చేసిన మిషన్లను ఇప్పటి వరకు పంపిణీ చేయకపోవడం సరైంది కాదు. ఇప్పటికైనా స్పందించి మండల సమాఖ్య సీఏలు రూపొందించిన జాబితాలోని లబ్ధిదారులకు పంపిణీ చేయాలి.

– గద్దం సుమ, మహిళా సంఘం సభ్యురాలు, టేకుమట్ల

ఎదురు చూస్తున్నాం..



గత ఎన్నికలకు ముందు మహిళల కోసం అప్పటి కలెక్టర్ పంపిణీ చేసిన కుట్టు మిషన్‌ల కోసం సంవత్సరం పైగా ఎదురు చూస్తున్నాం. అప్పుడు పంపిణీ చేసి ఆపారు. కుట్టు మిషన్ ఉంటే కొంచెం ఆసరాగా ఉండును. ఇప్పటికైనా అధికారులు స్పందించి మహిళల కోసం వచ్చిన కుట్టు మిషన్లను వెంటనే పంపిణీ చేయాలి.

– సుమలత, మహిళా సంఘం సభ్యురాలు, గర్మిళ్లపల్లి

ఆర్థిక లబ్ధి కోసమే మోసం

- బీజేపీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు సునీల్‌రెడ్డి



మాట్లాడుతున్న చంద్రుపట్ల సునీల్‌రెడ్డి

పలిమెల: రాష్ట్ర మంత్రి, మంథని ఎమ్మెల్యే శ్రీధర్ బాబు ఆర్థిక లబ్ధి కోసమే అనుచరులను ప్రోత్సహించి పలిమెల మండలంలోని అమాయక రైతులకు అన్యాయం చేశారని, రైతుల భూములను ఎమ్మార్వో దక్కన్ సిమెంట్ ఫ్యాక్టరీ పేరు మీద ఎలా పట్ట చేస్తారని బీజేపీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మంత్రి శ్రీధర్ బాబు అనుచరులు మండలంలో దక్కన్ సిమెంట్ ఫ్యాక్టరీ వస్తుందని అమాయకులైన రైతులకు తెలియకుండా రిజిస్ట్రేషన్ చేసుకొని అదే భూమిని దక్కన్ సిమెంట్ వద్ద భారీగా ముడుపులు తీసుకొని సిమెంట్ ఫ్యాక్టరీ పేరు మీద రిజిస్ట్రేషన్ చేశారన్నారు. ఇదంతా ఇక్కడి మంత్రి శ్రీధర్ బాబుకు తెలియకుండానే జరిగిందా అని ఆయన ప్రశ్నించారు. ఇక్కడ రిజిస్ట్రేషన్లు చేయించిన ఆయనే మళ్లీ ఎంక్వైయిరీ పేరు మీద అధికారులను పంపి హడావిడి సృష్టించి రైతులను, ప్రజలకు మోసం చేస్తున్నారన్నారు. మండల అధ్యక్షులు కోయాల్కర్ నిరంజన్, బండ మల్లారెడ్డి, శ్రీధర్, పూర్ణ చందర్, భాస్కర్‌రెడ్డి, అంజిబాబు, రామ్ శెట్టి మనోజ్, బండ శ్రీకాంత్, పాణ్యం బాలరాజు, వంశీ, నరేష్, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లు సమయపాలన పాటించాలి

- సీడీపీఓ మల్లీశ్వరి



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ మల్లీశ్వరి

చిట్యాల: అంగన్‌వాడీ టీచర్లు పాఠశాలలో సమయపాలన పాటించాలని సీడీపీఓ మల్లీశ్వరీ తెలిపారు. శుక్రవారం మండలంలోని జూకల్ గ్రామ రైతు వేదికలో చిట్యాల, మొగుళ్లపల్లి, టేకుమట్ల మూడు మండలాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లకు పోషణ్ ట్రాకర్ యాప్‌పై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీడీపీఓ మల్లిశ్వరీ హాజరై మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్లు యూనిఫామ్ ధరించాలని, మెనూ ప్రకారం వంట చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు జయప్రద, సరోజన, రజిత, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

- మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేశ్



నియామక పత్రాలను అందజేస్తున్న వెంకటేశ్

చిట్యాల: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేశ్‌గౌడ్ అన్నారు. మండలంలోని జడలపేట, నైన్‌పాక గ్రామాలలో పార్టీ బూత్ కమిటీలను ఎన్నుకున్నారు. అనంతరం వారికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మధ్య తరగతి ప్రజలకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సారధ్యంలో న్యాయం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకుల పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి యమున

- వైద్యాధికారి యమున

మంగపేట: విద్యార్థులు పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలని చుంచుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి చన్నపెల్లి యమున సూచించారు. చుంచుపల్లిలోని ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రత్యేక హెల్త్ క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి యమున విద్యార్థినులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆహారం తీసుకునే ముందు తీసుకున్న అనంతరం చేతులను శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. శీతాకాలంలో జలుబు, దగ్గు రాకుండా ఉండేందుకు విద్యార్థులకు కాచి వడపోచి చల్లార్చిన నీటిని తాగించాలని హాస్టల్ వార్డెన్, హెచ్‌ఎంలకు సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ శైలజ, హెచ్‌వీ నాగమణి, ఏఎన్‌ఎం రమాదేవి ఆశకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీలపై దాడి చేయడం సరికాదు

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు బలరాం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ములుగు రూరల్: పార్లమెంట్‌లో సహచర ఎంపీలపై దాడి చేయడం సరికాదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం అన్నారు. శుక్రవారం బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాయంచు నాగరాజు ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంపీ హోదాలో ఉంది శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన రాహుల్‌గాంధీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. భవిష్యత్‌లో ప్రధాన మంత్రి కావాలని కలలు కనడం రాహుల్ గాంధీ అవివేకానికి నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు భాస్కర్ రెడ్డి, రవింద్రాచారి, విశ్వనాథ రవిరెడ్డి, కుమార్, హేమాద్రి, వెంకటేశ్, హరిశ్, కృష్ణమూర్తి, భానుప్రసాద్, విక్రాంత్, వెంకట్‌రెడ్డి, సతీష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దాతల సాయం అభినందనీయం

- ఎంఈఓ పాదెం మేనక



బ్యాగులు, ఆట వస్తువులు అందజేస్తున్న ఎంఈఓ

మంగపేట: నిరుపేద విద్యార్థులకు దాతలు ముందుకు వచ్చి సాయం చేయడం అభినందనీయం అని ఎంఈఓ పాదెం మేనక అన్నారు. మండలంలోని కొత్తూరుమొట్లగూడెం పంచాయతీ పరిధిలోని రేగులగూడెం ప్రాథమిక పాఠశాలలోని 35 మంది విద్యార్థులకు పలువురు దాతలు రూ.10,000 విలువైన స్కూలు బ్యాగులు, నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్లు ఆట వస్తువులను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. రోడ్డు మార్గం లేనటువంటి దట్టమైన అటవీ ప్రాంతంలోని ఆదివాసీ గొత్తికోయ గిరిజన ఆవసా గ్రామమైన రేగులగూడెం పాఠశాలలో చదువుకుంటున్న నిరుపేద గొత్తికోయ గిరిజన విద్యార్థులకు దాతలు సాయం అందించారన్నారు. అలాగే హనుమకొండకు చెందిన శుభం ఈవెంట్ ఆర్గనైజర్ మంతెన మనోజ్ రెడ్డి అతడి కూతురు పుట్టిన రోజు సందర్భంగా రూ.5,000 విలువైన ఆట వస్తువులు, టీఎల్‌ఎం చార్ట్స్, మండలంలోని గాంధీనగర్ గ్రామానికి చెందిన ఆచంట శ్రీనివాస్, రమేష్ వారి తండ్రి ఆచంట కృష్ణారావు జ్ఞాపకార్థంగా రూ.5,000 విలువైన స్కూలుబ్యాగులు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్ళను అందజేశారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రాజు, శ్రీనివాస్, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్‌రెడ్డి, క్రాంతి, ప్రవీణ, మాతంగి మధు, సతీష్, శ్రీధర్, విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు.

అడవుల రక్షణ అందరి బాధ్యత

వాజేడు: అడవుల రక్షణ అందరి బాధ్యత అని ఎఫ్‌ఎస్‌ఓలు నారాయణ, నాగమణి, రామ్మూర్తి అన్నారు. మండల పరిధిలోని కొత్తటేకులగూడెం, కృష్ణాపురం, మండపాక గ్రామాల్లో ప్రజలకు, సిబ్బందికి శుక్రవారం అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అడవిలోకి వెళ్లిన ప్రజలు చీపురు కోసే టప్పుడు, ఇప్ప పువ్వులు ఏరే టప్పుడు నిప్పు పెట్టవద్దన్నారు. అడవి జంతువులను వేటాడవద్దన్నారు. ఉచ్చులు, విద్యుత్ తీగెలు అమర్చి జంతువులను హతమార్చడం చట్టపరంగా నేరమన్నారు. వన్య ప్రాణాలను కాపాడుకోవడం బాధ్యత అని సూచించారు.

అమిత్ షాను బర్తరఫ్ చేయాలి

- మాలమహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభాకర్



రేగొండ: అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు



పలిమెల: మాట్లాడుతున్న సోదల శంకర్



మొగుళ్లపల్లి: నిరసన చేస్తున్న నాయకులు

రేగొండ: అంబేడ్కర్‌ను పార్లమెంట్ సాక్షిగా అవమానపరిచిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను వెంటనే మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని మాలమహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జిల్ల ప్రభాకర్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అమిత్‌షా వ్యాఖ్యాలను నిరసిస్తూ శుక్రవారం మండల కేంద్రంలో దిష్టి బొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళిత బహుజనులను అవమానించే విధంగా అమిత్‌షా పలుమార్లు మాట్లాడుతున్న మోదీ పట్టించుకోవడందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పసుల అశోక్, ముద్దమల్ల సమ్మయ్య, మండల తిరుపతి, పసుల రాకేశ్, బొల్లం భాస్కర్, రాజయ్య, రమేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.

పలిమెల: కేంద్ర మంత్రి అమిత్ షా ప్రజలకు క్షమపణ చెప్పాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సోదల శంకర్, పోలం రాజేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఈ మేరకు కలిసి మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంబేడ్కర్‌ని అవమానించడం అమిత్ షా అహంకారానికి నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షుడు తాలం శ్రీను, మండల కార్యదర్శి పెద్దిశేఖర్, కొవ్వూరి నలిన్ రాజుచ తదితరులు పాల్గొన్నారు.

భూపాలపల్లి అర్బన్: అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వెంటనే క్షమాపణ చెప్పాలని ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ, కేవీపీఎస్ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ధర్నా చేపట్టారు. కేంద్రం అంబేడ్కర్ రాసిన రాజ్యాంగ హక్కులను కాలరాస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు స్మరణ్, రాజు, శ్రీధర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: అంబేడ్కర్‌ను అవమానపరిచే విధంగా వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షాపై కేసు నమోదు చేయాలని ఏఐవైఎస్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ పుల్ల మల్లయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఏఐవైఎస్‌నాయకులు నిరసన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగం ప్రకారం పదవి అనుభవిస్తున్న అమిత్‌షా పార్లమెంట్‌లో అంబేడ్కర్ పేరును జపించడం ఫ్యాషన్ అయిందంటూ చేసిన వ్యాఖ్యలు సరికావని అన్నారు. ఈ కార్యక్రమంలో నిమ్మల భద్రయ్య, సురేందర్, సమ్మయ్య, బండారు పాపయ్య, దూడపాక రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

కొత్త వ్యక్తులకు ఆశ్రయం ఇవ్వొద్దు

ఏటూరునాగారం: కొత్త వ్యక్తులకు ఆశ్రయం ఇవ్వొద్దని ఎస్సై తాజుద్దీన్ అన్నారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ క్రాస్ రోడ్డు పరిసర ప్రాంతాలలో శుక్రవారం ఎస్సై ఆధ్వర్యంలో ఇంటింటా తనిఖీలను చేపట్టారు. సిబ్బందితో కలిసి ఇళ్లను సోదాలు చేశారు. ఇంటి యజమానులు, అద్దెకు ఉంటున్న వారి వివరాలు ధ్రువపత్రాలు క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ చుట్టూ ఉన్న ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేసి అనుమానితులిని అదుపులోకి తీసుకోని విచారించి వదిలేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. తెలియని వారికి ఇళ్లు అద్దెకు ఇవ్వవద్దన్నారు. అనుమానాస్పదంగా సంచరిస్తే పోలీసు వారికి సమాచారం అందించాలన్నారు.

చెక్కు అందజేత

ఏటూరునాగారం: మండల కేంద్రానికి చెందిన బొగ్గుల రామకృష్ణ చెట్టుమీద నుంచి పడి ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో అతడి పేరుపై వచ్చిన రూ.83వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును తల్లిదండ్రులు బొగ్గుల సావిత్రి, నర్సయ్యలకు అందజేసినట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిటమట రఘు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ అయూబ్ ఖాన్, జిల్లా అధికార ప్రతినిధి ముక్కెర లాలయ్య, కార్యదర్శి గుడ్ల దేవేందర్ ఉన్నారు.

ఆటో కార్మికుల ముందస్తు అరెస్ట్



ఎస్ఎస్ తాడ్వాయి: అరెస్టు అయిన కార్మికులు



వాజేడులో..




వెంకటాపురం(కె)లో..

ఎస్ఎస్‌తాడ్వాయి: హైదరాబాద్‌లోని అసెంబ్లీ ముట్టడికి శుక్రవారం తరలివెళ్తున్నారనే సమాచారం పోలీసులు ముందస్తుగా మండలంలోని ఆటో కార్మికులను అరెస్టు చేశారు. సొంత పూచీకతుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా మండల ఆటో కార్మికుల యూనియన్ నాయకులు శ్రీరాములు, చెవుగాని రఘుబాబు, పాండావుల లింగామూర్తి, ఠాకూర్ అశోక్‌సింగ్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఉచిత బస్సు ప్రయాణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

వాజేడు: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న ఆటో కార్మికులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ చేసిన వారిలో చిరంజీవి, కేశవరావు, ప్రవీణ్, సారయ్య, సమ్మయ్య, రాజేష్ వరుణ్ తదితరులు ఉన్నారు.

వెంకటాపుర(కె): ప్రభుత్వం తమ సమస్యలను పట్టించు కోవడం లేదని వాటిని పరిష్కరించాలని ఆటో యూనియన్ నాయకుడు తాటిశెట్టి రాజన్న డిమాండ్ చేశారు. శుక్రవారం అసెంబ్లీ ముట్టడికి వెళ్తుండా పోలీసులు ఆటో యూనియన్ నాయకులను అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు.

సర్వే వేగంగా పూర్తి చేయాలి



ఏటూరునాగారం: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ రాజ్యలక్ష్మీ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో, కోయగూడ ఎల్లాపురం గ్రామాల్లో నిర్వహిస్తున్న ఇందిరమ్మ సర్వేను ఆమె పరిశీలించారు. పేరు, అడ్రస్‌లు సరిగా నమోదు చేయాలన్నారు. సాంకేతిక సమస్యలు వస్తే వెంటనే సంప్రదించాలన్నారు. సర్వేలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. ప్రజాపాలనలో దరఖాస్తు పేర్ల ఆధారంగా సర్వే చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రమాదేవి, లక్ష్మీనారాయణ, సతీష్, ఈజీఎస్ ఏపీఓ చరణ్, సిబ్బంది సురేష్, రవి పాల్గొన్నారు.